క్లుప్తంగా

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

గరుగుబిల్లి: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందించడం జరుగుతుందని, బడిఈడు పిల్లలంతా ప్రభుత్వ బడుల్లోనే చేరాలని కొమరాడ ఐసీడీఎస్ పీవో జి.సుగుణకుమారి అన్నారు. మండలంలోని పెదగుడబ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె బుధవారం సందర్శించారు. అనంతరం అక్కడి చిన్నారులను ప్రీస్కూల్‌కు సంసిద్ధత చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆటపాటలతో కూడిన విద్యనందించడం జరుగుతుందని, అంగన్‌వాడీ విద్య పూర్తి చేసుకున్న పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటో తరగతిలో చేరాలని తెలిపారు. అలాగే ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదివే వారికి కల్పిస్తున్న సదుపాయాలు, వర్తిస్తున్న పథకాలను వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త చింతాడ గౌరమ్మ, ఏఎన్‌ఎం ఎస్.రవణమ్మ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



మిశ్రో

సీతంపేట: ఎంపీడీఓగా బి.బి మిశ్రో బుధవారం బాధ్యతలు స్వీకరించారు. పొందూరు మండల పరిషత్ కార్యాలయంలో ఏఓగా పని చేసి ఉద్యోగోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజన ప్రాంతంలో పని చేసే అవకాశం రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. లబ్ధిదారులందరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తానని చెప్పారు.

చిత్రలేఖనంపై మక్కువ పెంచుకోండి..



చిత్రలేఖనంలో మెలకువలు తెలుసుకుంటున్న విద్యార్థులు

పాలకొండ రూరల్: చిత్రలేఖనంపై మక్కువ పెంచుకోవడం ద్వారా సృజనాత్మకతకు దృశ్యరూపం ఇవ్వవచ్చని స్థానిక గ్రంథాలయాధికారి బి. గణేష్‌బాబు అన్నారు. బుధవారం స్థానిక గ్రంథాలయంలో డ్రాయింగ్ ఉపాధ్యాయుడు మురళీ విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. అనంతరం చిన్నారులచే పుస్తక పఠనం చేయించారు.

రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

జియ్యమ్మవలస రూరల్: మండల కేంద్రంలో రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి బుధవారం భూమిపూజ చేశారు. ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి చిలకలవానివలస మీదుగా పసుపువానివలసకు 1.65 కిలోమీటర్ల రోడ్డు నిర్మించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. రూ.1.65 కోట్లతో ఈ నిర్మాణ పనులు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బొంగు సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధనోత్సవం

పాలకొండ రూరల్: స్థానిక ఇందిరానగర్ కాలనీలో గల వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఆరాధనోత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు శ్రీరామ్ ప్రసాద్ పాడి, పవన్ పాడి పూజలు, అభిషేకాలు చేపట్టారు. విశ్వబ్రాహ్మణ సేవా సంఘ సభ్యులు సహకరించారు.

● ఆరాధనా దినోత్సవం



వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనా దినోత్సవాన్ని బుధవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక పైడితల్లి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో వీరఘట్టంనకు చెందిన విశ్వబ్రాహ్మణులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. యజ్ఞకర్త ఎస్‌వీఎల్‌ఎన్ శర్మయాజీ ఆధ్వర్యంలో జరిగిన పూజా కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణుల సంఘ జిల్లా అధ్యక్షుడు బూరాడ లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు. - వీరఘట్టం

● చలివేంద్రం ఏర్పాటు..



వీరఘట్టం మండల కేంద్రంలోని పైడితల్లి ఆలయం వద్ద ప్రముఖ యజ్ఞకర్త ఎస్‌వీఎల్‌ఎన్ శర్మయాజీ బుధవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. బాటసారుల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఉపయోగపడుతుందని శర్మయాజీ తెలిపారు. - వీరఘట్టం

● రూపు కోల్పోతున్న కోనేరు



పాలకొండ గోదారమ్మగా పేరుగాంచిన వెంకట్రాయుని కోనేరు పూడికలతో తన రూపు కోల్పోతుంది. పట్టణానికే తలమానికంగా ఉన్న ఈ కోనేరు వందలాదిమంది ప్రజల నీటి అవసరాలను తీరుస్తోంది. ఈ కోనేరుపైనే రైతులు, మత్స్యకారులు ఆధారపడుతున్నారు. ప్రస్తుతం కోనేటిలో తామర, గుర్రపు డెక్క పేరుకుపోతోంది. ఇటీవల కాలంలో రూ. లక్షలు వెచ్చించి కోనేటిని శుభ్రం చేసినా.. అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగా సమస్య మళ్లీ మొదటికి వచ్చిందని ప్రజలు చెబుతున్నారు. అధికారులు స్పందించి కోనేటిని అభివృద్ధి చేయాలని కోరుతున్నారు. - పాలకొండ రూరల్

మెగా డీఎస్సీలో ఆదివాసీలకు అన్యాయం

- ప్రత్యేక డీఎస్సీ ప్రకటించి, నిర్వహించాలి
- ఆదివాసీ ఆత్మగౌరవ సభ, ర్యాలీలో ఆదివాసీ జేఏసీ డిమాండ్



ర్యాలీలో పాల్గొన్న ఆదివాసీ జేఏసీ నాయకులు, తదితరులు

గుమ్మలక్ష్మీపురం: ఆదివాసీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టాలు పరిరక్షించాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ ఆత్మగౌరవ సభ, ర్యాలీ మండల కేంద్రంలో బుధవారం నిర్వహించారు. ఆదివాసీ జేఏసీ(జాయింట్ యాక్షన్ కమిటీ) ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున ఏజేఏసీ నాయకులు, గిరిజన సంఘాల నేతలు పాల్గొని, తమ హక్కులపై గళంవిప్పారు. ఆదివాసీ ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలని, ట్రైబల్ అడ్వయిజరీ బోర్డు ఏర్పాటు చేయాలి, నకిలీ గిరిజన సర్టిఫికెట్లు రద్దు చేయాలి, 1/70 చట్టం పటిష్టంగా అమలు చేయాలని, జీవో నంబరు 3 పునరుద్ధరణ లేదా ఆ జీవో స్థానంలో కొత్త జీవో తీసుకువచ్చి, జీవో నంబరు 3 కన్నా మెరుగ్గా అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇటీవల విడుదల చేసిన మెగా డీఎస్సీలో గిరిజనులకు తీవ్రం అన్యాయం చేశారని, గిరిజన సంక్షేమ శాఖలోని పోస్టులను గిరిజనేతరులకు 90 శాతానికి పైగా కేటాయించడం వల్ల గిరిజనులు నష్టపోతున్నారన్నారు. గిరిజన ప్రాంతాల్లోని ఉపాధ్యాయ పోస్టులను శతశాతం గిరిజన అభ్యర్థులకే కేటాయించేలా చూడాలన్నారు. ఎన్నికల సమయంలో ఆదివాసీలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలన్నారు. ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద మానవహారం, ఆ తర్వాత వైటీసీ వద్ద సభ నిర్వహించి, ఆదివాసీల హక్కుల సాధన, పరిరక్షణపై వక్తలు మాట్లాడారు. కార్యక్రమంలో ఏజేఏసీ నాయకులు ఎన్.సింహాచలం, కె.దీనమయ్య, ఆర్.లోవరాజు, ఐ.రామకృష్ణ, టి.జీవన్న తదితరులు పాల్గొన్నారు.

విద్యా సంవత్సరం ఆరంభం రోజే పుస్తకాలు



పుస్తకాలు పరిశీలిస్తున్న డిప్యూటీ ఈవో రాజ్‌కుమార్

గరుగుబిల్లి: కొత్త విద్యా సంవత్సరం ఆరంభం రోజే విద్యార్థులకు నోటు, పాఠ్యపుస్తకాలు అందజేసేలా చర్యలు తీసుకుంటున్నామని డిప్యూటీ ఈవో రాజ్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని బుక్స్ స్టాక్ పాయింట్‌ను ఆయన బుధవారం పరిశీలించారు. ఏయే పుస్తకాలు ఎన్ని వచ్చాయి.. ఇంకా రావాల్సిన పుస్తకాలు ఏమైనా ఉన్నాయా అని ఆరాతీశారు. అనంతరం స్టాక్ రిజిస్టర్ చూసి, వచ్చిన పుస్తకాల వివరాలు సరిచూశారు. పాఠశాలల పునఃప్రారంభం నాటికి అన్ని పాఠశాలలకు పుస్తకాలు పంపిణీ అయ్యేలా చూడాలని సిబ్బందికి సూచించారు. అలాగే బడిఈడు పిల్లలు బడిలో చేరేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ఆయన వెంట ఎంఈవోలు దత్తి అప్పలనాయుడు, కె.కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద తయారుకావాలి



చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎల్‌పీవో కొండలరావు

కొమరాడ: చెత్త నుంచి సంపద తయారుకావాలని, ఆ దిశగా చర్యలు తీసుకోవాలని డీఎల్‌పీవో(జిల్లా గ్రామపంచాయతీ అధికారి) కె.కొండలరావు సూచించారు. మండలంలోని కుమ్మరిగుంట గ్రామంలోని ఎస్‌డబ్ల్యూపీసీ(చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం)ని ఆయన బుధవారం సందర్శించారు. గ్రామంలో ఇంటింటి నుంచి సేకరిస్తున్న చెత్తాచెదారం ఇక్కడి కేంద్రానికి తరలించి, సేంద్రియ ఎరువు తయారు చేయాలని తెలిపారు. ఇక్కడ తయారయ్యే ఎరువును రైతులకు సబ్సిడీపై అందజేసి, తద్వారా పంచాయతీకి అదనపు ఆదాయం సమకూర్చాలన్నారు. ఆయన వెంట పంచాయతీ విస్తరణాధికారి ఎం.గోపాలకృష్ణ, సర్పంచ్ గొర్లి లక్ష్మణరావు తదితరులు ఉన్నారు.

జాగ్రత్తలు పాటించాలి



బాలికలకు అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

పాలకొండ రూరల్: బాలికలు వ్యక్తిగత ఆరోగ్యం మెరుగుపరుచుకోవడానికి జాగ్రత్తలు పాటించాలని అంగన్‌వాడీ సిబ్బంది జి.శారద అన్నారు. కిశోర బాలికల వికాసం కార్యక్రమంలో భాగంగా కస్పావీధి క్లస్టర్ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాలికలు ధైర్యంగా మెలగడంతో పాటు వారి సంరక్షణ కోసం రూపొందించిన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో పలు కేంద్రాలకు సంబంధించిన అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

ఈదురగాలుల బీభత్సం



సతివాడలో పడిపోయిన చెట్ల కొమ్మలు, విద్యుత్ తీగలు

భామిని: మండలంలోని పెద్ద దిమిలి, సతివాడ, కీసర, కోసలి గ్రామాల్లో బుధవారం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో పలు చోట్ల విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. అలాగే చెట్ల కొమ్మలు విరిగిపడ్డాయి. ఆయా గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో వెంటనే విద్యుత్‌శాఖాధికారులు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టారు. అలాగే ఆరబెట్టిన మొక్కజొన్న గింజలు తడిసిపోవడంతో రైతులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

పరామర్శ



మాజీ ఎమ్మెల్యే జయరాజ్‌ను పరామర్శిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర

జియ్యమ్మవలస: మండలంలోని వనజ గ్రామానికి చెందిన మాజీ ఎమ్మెల్యే నిమ్మక జయరాజ్ సోదరుడు విజయానంద్ మంగళవారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర.. బుధవారం ఆ గ్రామం వెళ్లి, మాజీ ఎమ్మెల్యే జయరాజ్‌ను పరామర్శించారు. అనంతరం విజయానంద్ మరణానికి గల కారణాలను అడిగి తెలుసుకుని, ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుడి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు.

కొనసాగుతున్న శ్రీరామాలయ ప్రతిష్ఠ

బలిజిపేట: మండలంలోని బడేవలసలో శ్రీరామాలయ ప్రతిష్ఠ మహోత్సవాల్లో భాగంగా రెండవరోజు సూర్యనమస్కారాలు, ప్రత్యేక పూజలు చేశారు. యర్ల రాంబాబు శాస్త్రి ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు. సుప్రభాత సేవ, మంటప అర్చనలు, సర్వదేవతా హోమాలు, ఆరోగ్యప్రదాత సూర్యనారాయణస్వామికి సూర్యనమస్కారాలు తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఏక పాత్రాభినయ పౌరాణిక పద్యపోటీలు నిర్వహించారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో ఆరాధన

సీతానగరం: మండల కేంద్రంలోని ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో అర్చకుడు పోలాకి నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం ఆరాధన పూజలు ఘనంగా జరిగాయి. వైశాఖ శుద్ధదశమి జగద్గురు శ్రీమద్విరాట్ వీరబ్రహ్మేంద్ర స్వామి ఆరాధనోత్సవాల్లో భాగంగా, గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామివారికి ఆరాధన నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



అన్నవరంలో ఉపాధి వేతనదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ విజయ రంగారావు

పాలకొండ రూరల్:

మండలంలోని అన్నవరం, గోపాలపురం, తదితర ప్రాంతాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీఓ ఎం. విజయరంగారావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మస్టర్లు, వేతనదారుల హాజరు రికార్డులను పరిశీలించారు. పనులు జరుగుతున్న ప్రదేశాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు.

మృతులను గుర్తించండి



మాట్లాడుతున్న తహసీల్దార్ శివన్నారాయణ

భామిని: పీఎం కిసాన్ సహాయం పొందుతూ మృతి చెందిన రైతులను గుర్తించి, వారి వారసుల పేరుమీద భూముల మ్యుటేషన్ పెట్టాలని తహసీల్దార్ ఎస్.శివన్నారాయణ అన్నారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల వ్యవసాయాధికారి కె.సింహాచలం ఆధ్వర్యంలో వ్యవసాయ సహాయకులు, వీఆర్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా రైతు సమస్యలను ఎలా పరిష్కరించాలన్న విషయమై చర్చించారు.

డయల్ యువర్ డీఎం రేపు

పాలకొండ: స్థానిక ఆర్టీసీ డిపో పరిధిలోని ప్రయాణికుల సమస్యల పరిష్కారం కోసం చర్యలు తీసుకుంటున్నామని డిపో మేనేజర్ వెంకటేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ఈ నెల 9న డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి 12 వరకు ఈ కార్యక్రమం ద్వారా ఫిర్యాదులు తీసుకుంటామని తెలిపారు. ప్రయాణికులు తగిన సూచనలు, సలహాలు 99592 25057 నంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు.

ఆకట్టుకున్న వేషధారణలు



గుమ్మలక్ష్మీపురం మండలం, ఎల్విన్‌పేటలో జరుగుతున్న నీలమ్మ గ్రామదేవత ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఘటాల ఊరేగింపు, పలు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. ఉదయం గ్రామస్తులు నీలమ్మతల్లికి ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు చెల్లించుకున్నారు. ఘటాల తిరువీధిలో పలువురు వేసిన వేషధారణలు, చేసిన నృత్య ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకున్నాయి. పండగ నేపథ్యంలో ప్రతి ఇల్లు బంధుమిత్రులతో సందడిగా కనిపిస్తోంది. -గుమ్మలక్ష్మీపురం

గిరిజన గ్రామాల అభివృద్ధికి కృషి



పాఠశాల ప్రహరీకి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ

సీతంపేట: గిరిజన గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో చేపట్టనున్న అభివృద్ధి పనులకు బుధవారం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. మల్లి, జిల్లేడుపాడు పాఠశాలల ప్రహరీ నిర్మాణాలకు.. శంభాం, వాబ గ్రామాల్లో వాటర్ సప్లై పైప్‌లైన్‌కు శంకుస్థాపన చేశారు. అలాగే జిల్లేడుపాడులో ఏర్పాటు చేసిన పశువుల నీటితొట్టి ప్రారంభించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ బి.సంధ్యారాణి, తూర్పుకాపు కార్పొరేషన్ డైరెక్టర్ సత్తిబాబు, ఐటీడీపీ కో ఆర్డినేటర్ ఇమరక పవన్, కూటమి నాయకులు హెచ్.ప్రసాద్, జి.రవణమ్మ, సంతోష్, శేఖర్ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక అధికారి సర్వేశ్వరరావు

సీతంపేట: మండల కేంద్రంలోని ఎస్‌బీఐ ఆవరణలో అగ్ని ప్రమాదాల నివారణపై సిబ్బంది, ప్రజలకు అగ్నిమాపక అధికారి సర్వేశ్వరరావు బుధవారం అవగాహన కల్పించారు. విలువైన ఫైల్స్, ఎలక్ట్రికల్ పరికరాలు, కంప్యూటర్లు కాలిపోయే సమయంలో నష్ట నివారణ నెలా చేపట్టాలో ప్రయోగపూర్వకంగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ సత్తిబాబు, సిబ్బంది శ్యామలరావు, టి.రాజు, నరసింహరావు, ఖాతాదారులు పాల్గొన్నారు.



కొమరాడ: బల్లపాడులో అల్లూరి వర్ధంతి సభలో మాట్లాడుతున్న రైతుకూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు సింహాద్రి ఝాన్సీ



గుమ్మలక్ష్మీపురం(కురుపాం): టీకేజమ్ములో యస్ సొసైటీ ఆధ్వర్యంలో అల్లూరి వర్ధంతిలో పాల్గొన్న గ్రామస్తులు, సొసైటీ సభ్యులు

అల్లూరి పోరాటం స్ఫూర్తిదాయకం

మన్యంవీరుడు, అడవిబిడ్డల ఆశాజ్యోతి అల్లూరి సీతారామరాజు వర్ధంతి బుధవారం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, గిరిజన సంఘాల నాయకులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులంతా అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. దేశ స్వాతంత్ర్య సాధనే లక్ష్యంగా అల్లూరి సీతారామరాజు చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమన్నారు. బ్రిటీష్ బానిన సంకెళ్ల నుంచి ప్రజలను విముక్తులను చేసేందుకు ఊపిరొదిలిన ప్రముఖుల్లో అల్లూరి ప్రథములన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతిఒక్కరం కృషి చేయాలని కోరారు. -కొమరాడ, గుమ్మలక్ష్మీపురం(కురుపాం), సీతంపేట



కొమరాడ: అల్లూరి సీతారామరాజు వర్ధంతి సభకు హాజరైన గిరిజనులు



సీతంపేట: ఐటీడీఏలో అల్లూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న ఏపీఓ చిన్నబాబు, తదితరులు



సీతంపేట: మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద అల్లూరి సీతారామరాజు విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఎంపీపీ ఆదినారాయణ, తదితరులు